సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

నూకాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన



అమ్మవారిని దర్శించుకొంటున్న దేవన్‌రెడ్డి

గాజువాక: జీవీఎంసీ 65వ వార్డు భానోజీతోట ఆలయంలో నూకాంబిక అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమంతోపాటు వివిధ పూజలను వైభవంగా జరిపించారు. వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులను అభినందించారు. స్థానిక నాయకులు గాంధీ, జగదీష్, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



ముస్లిం సోదరులతో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసితకాలనీ లేమర్తిలో మసీద్ ఈ ఇబ్రహీం కమిటీ ఆధ్వర్యంలో షేక్ రెహమాన్ మిత్ర బృందం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మతాలకు అతీతంగా అంతా కలిసి మెలిసి జీవనం సాగించే తత్వం ఉందని, మతసామర్యానికి ప్రతీకగా నిలిచే పండగలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర నూర్‌బాషా సంఘం కన్వీనర్ షేక్ ఇస్మాయిల్, కమిటీ అధ్యక్షుడు షేక్ రెహ్మాన్, స్థానిక నాయకులు ఇల్లపు ప్రసాద్, కర్రి దోశేంద్ర, ఇల్లపు వాసు, దాసరి రమేష్‌బాబు, సరిపల్లి ఖాన్ షాహెబ్, అబ్దుల్లా మాస్టర్ పాల్గొన్నారు.

లంకెలపాలెం - గాజువాక రహదారిని విస్తరించండి



జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అగనంపూడి: గాజువాక నుంచి లంకెలపాలెం మధ్యలో రహదారిని విస్తరించాలని అగనంపూడికి చెందిన నాయకులు జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌ను కలిసిన నాయకులు రహదారి విస్తరణ ఆవశ్యకతను వివరించారు. నగరం నుంచి గాజువాక మీదుగా పరవాడ, లంకెలపాలెం, ఫార్మాసిటీ, అచ్యుతాపురం సెజ్‌లకు నిత్యం వందలాది బస్సులు తిరుగుతున్నాయని, వాటికి నిర్దేశిత ప్రాంతంలో బస్ స్టాప్‌లు ఏర్పాటు చేయాలని కోరారు.ఎక్కడపడితే అక్కడ బస్‌లు నిలపడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. అలాగే హోమీబాబా కేన్సర్‌ఆస్పత్రిలో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని నాయకులు పల్లా కార్తీక్, బలిరెడ్డి సత్యనారాయణ తదితరులు కలెక్టర్ వినతిపత్రంలో కోరారు.

బీఈడీ పరీక్ష కేంద్రం తనిఖీ



పరీక్ష కేంద్రంలో డీన్ కేశవరావు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ విద్యా విభాగంలో బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ మూడో సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. వీటిని సోమవారం యూనివర్సిటీ పీజీ పరీక్షల డీన్ ఆచార్య కేశవరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణ తీరుపై విభాగాధిపతి ఆచార్య షారోన్ రాజును అడిగి తెలుసుకున్నారు. పరీక్షకు 95 మంది నమోదు చేసుకోగా.. 94 మంది హాజరైనట్లు షారోన్‌రాజు తెలిపారు. పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని వివరించారు.

ఏరు దాటేదాక ఓడ మల్లన్న.. ఏరు దాటాక బోడి మల్లన్న అన్న చందంగా ఉంది కూటమి నేతల తీరు.. ఎన్నికల ముందు ప్రజలను ఏమార్చడానికి ఇష్టం వచ్చినట్టు ఊదరగొట్టారు. అధికారం వచ్చాక అవేవీ గుర్తు లేనట్టు ప్రజలపై భారాలు మోపుతున్నారు. ఆ కోవకే చెందుతుంది స్మార్ట్ మీటర్ల ఏర్పాటు. ఎన్నికల సమయంలో ఎట్టిపరిస్థితుల్లో స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేయనీబోమని ప్రచారం చేశారు. ఇప్పుడు గేట్లు తెరిచేశారు. **అయితే సామాన్యులు దీనిపై మండిపడుతున్నారు.**

స్మార్ట్ షాక్!

- కేటగిరీ-2, దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు మరూ
- పెదగంట్యాడ మండల పరిధిలో 1844 స్మార్ట్ మీటర్లు ఏర్పాటు
- పూర్తి స్థాయిలో అమర్చేందుకు సన్నద్ధం
- ముందే రీచార్జ్ చేయకపోతే చీకటే
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పేదలు



పెదగంట్యాడలో దుకాణం వద్ద ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్



సమతానగర్‌లో ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్

పెదగంట్యాడ: విద్యుత్ శాఖ సాధారణ మీటర్లకు స్వస్తి చెబుతోంది.స్మార్ట్ మీటర్ల ఏర్పాటును షురూ చేస్తోంది. తొలి విడతలో కేటగిరీ-2, దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, సామాజిక భవనాలు, పరిశ్రమలకు స్మార్ట్ మీటర్లు (ప్రీపెయిడ్ మీటర్లు) వేస్తున్నారు. రెండో విడతలో గృహాలకు స్మార్ట్‌మీటర్లు అమర్చడానికి సన్నద్ధమవుతున్నారు. స్మార్ట్ మీటర్లకు వినియోగదారులు ముందస్తుగా రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియపై పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి : పెదగంట్యాడ మండల పరిధిలో సుమారు 52000 పైగా వివిధ రకాల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇప్పటికే అర్బన్, రూరల్‌లో కలపి సుమారు 1844 కేటగిరి 2, 3, 4 లకు స్మార్ట్ మీటర్లు అమర్చారు. ప్రస్తుతానికి ఈ మీటర్లకు సిమ్ కార్డులు అమర్చలేదు. దశల వారీగా వాటిని ప్రీపెయిడ్ మీటర్లగా మార్చనున్నారు. అలా అయితే ముందుగానే రీచార్జి చేసుకోవాలి. దీంతో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే పేద ప్రజలకు చాలా ఇబ్బందిగా ఉంటుందనే అభిప్రాయాలు అంతటా వ్యక్తం అవుతున్నాయి.

ఉన్న మీటర్లనే కొనసాగించాలి



ప్రభుత్వం స్పందించి మాలాంటి వారికి ఉన్న మీటర్లనే కొనసాగించాలి. రాత్రి సమయంలో రీచార్జ్ అయిపోతే కరెంట్ కట్ అయిపోతుంది. నాకు ఫోన్ వాడడమే రాదు.. రాత్రంతా చీకటిలో ఉండాల్సిందేనా .. ఇళ్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

– శీరపు అప్పలనర్సమ్మ, పాత అయన్నపాలెం, పెదగంట్యాడ

నాణ్యమైన సరఫరా పొందవచ్చు



స్మార్ట్ మీటర్ల ద్వారా వినియోగదారులు నాణ్యమైన విద్యుత్ సరఫరా పొందవచ్చు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలు, సామాజిక భవనాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నాం. మండలంలో ఇప్పటి వరకై 1844 మీటర్లు ఏర్పాటు చేశాం. కేటగిరి–2 మీటర్లకు దాదాపుగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశాం. ఈ మీటర్ల ద్వారా మీ ఫోన్లోనే ఎప్పటికప్పుడు రీడింగ్ యూనిట్లను తెలుసుకోవచ్చు.

–కె. రాజేంద్రప్రసాద్, ఏఈ, పెదగంట్యాడ

నిరక్షరాస్యులకు అవస్థలు

త్వరలోనే అన్ని రకాల విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. స్మార్ట్‌మీటర్లతో తమకు ఇబ్బందులు తప్పవని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే విద్యుత్ వినియోగానికి ముందుస్తుగా రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. అంటే కరెంటు చార్జ్ ముందుగానే చెల్లించాలి. మన సెల్‌ఫోన్‌కు ఎలా రీచార్జ్ చేసుకుంటామో అదే విధానం అమలు కానుంది. విద్యుత్ మీటర్‌కు సంబంధించి రీచార్జ్ నగదు ఉన్నత మేరకు విద్యుత్ సరఫరా కొనసాగుతుంది. అయిపోగానే ఇళ్లంతా చీకటే.. దీంతో స్మార్ట్ ఫోన్ లేని పేద ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోందనని పలువురు ఆలోచిస్తున్నారు.

రీచార్జ్ అయిపోతే పరిస్థితి ఏంటి?



ఇప్పటికే కరెంట్ బిల్లుల పెంపుతో పేదల అవస్థలు పడుతున్నారు. కూలి పనులు చేసుకునే వారు.. టెక్నాలజీపై అవగాహన లేని వారు సెల్ ఫోన్లో బ్యాలెన్స్ వేసుకోవాలంటేనే సెల్ షాపులను ఆశ్రయిస్తున్నారు. అలాంటిది రాత్రి సమయంలో స్మార్ట్ మీటర్‌కు రీచార్జ్ అయిపోతే పరిస్థితి ఏంటి.. అందకారంలో ఉండాల్సిందేనా. పేదలకు స్మార్ట్ మీటర్లతో ఇబ్బందులు తప్పవు. అసలు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లపై ప్రజలకు అవగాహనే లేదు.

– గొందేశి వెంకటరమణారెడ్డి. పెద కోరాడ,, పెదగంట్యాడ

ఘనంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం



సాయిబాబాకు పూజలు చేస్తున్న దేవన్‌రెడ్డి

కూర్మన్నపాలెం: సాయిబాబా మందిరం వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి బాబాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సాయిబాబా ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డగోవింద్, ఎర్రన్న, సన్యాసిరావు, సంతోష్, చిత్రాడ వెంకటరమణ, దానప్పలు,ప్రగడ శంకర్, పూడి ఆనంద్,గోపీనాథ్,ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు విస్తృతం



తరంగణి సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

కూర్మన్నపాలెం: ఆధ్యాత్మిక కార్యక్రమాలను విస్తృతం చేయాలని విశాఖ తరంగణి ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి బెల్లంకొండ అశోక్‌రాజ్ అన్నారు. స్థానిక కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్థానిక తరంగణి ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. పలు సేవా కార్యక్రమాలను సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో తరంగణి ప్రతినిధులు రామకృష్ణరాజు, డి.సన్యాసిరావు, కృష్ణంనాయుడు, ఉమామహేశ్వరి, అరవిందరాజు, కూర్మరాజు ప్రసంగించారు. కార్యక్రమంలో చోడవరం,అనకాపల్లి, నర్సీపట్నం,పాయకరావుపేట,యలమంచిలి,పెందుర్తి తదితర ప్రాంతాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ఓబీసీ అసోసియేషన్ వ్యవస్థాపక దినోత్సవం



స్టీల్ ట్రైనింగ్ విభాగం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న ఓబీసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 9వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ కార్యాలయం వద్ద ఓబీసీ ఫౌండర్ సభ్యులు దొడ్డి సన్నిబాబు జెండా ఎగుర వేశారు. కార్యక్రమంలో భాగంగా కూర్మన్నపాలెంలోని జ్యోతిరావు పూలే, డాక్టర్ బి. అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమం కోసం అసోసియేషన్ పని చేస్తుందన్నారు. ఇందు కోసం తమ కార్యవర్గం అనేక కార్యక్రమలు చేపట్టిందన్నారు. అనంతరం ట్రైనింగ్ విభాగం వద్ద జరిగిన కార్యక్రమంలో ఓబీసీ సంఘం అదనపు ప్రధానకార్యదర్శి నారాయణ, సీనియర్ సభ్యులు బి. కామేశ్వరరావులు జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బి. అప్పారావు, ప్రధానకార్యదర్శి శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ వై.ఎల్. నాయుడు, కోశాధికారి యు. శ్రీనివాస్, ఉప ప్రధానకార్యదర్శి కొయిలాడ శ్రీనివాస్, ఆర్. సత్యనారాయణ, వంగపండు సింహాచలం, కన్నబాబు పాల్గొన్నారు.

పండ్ల దుకాణం దగ్ధం



దగ్ధమవుతున్న పండ్ల దుకాణం

గాజువాక: కొత్త గాజువాక ఫ్రూట్ మార్కెట్‌లో ఒక దుకాణం దగ్ధమైంది. నాయుడు అనే వ్యక్తికి చెందిన దుకాణంలో సోమవారం వివిధ రకాల పండ్లు ఉంచి ఇంటికి వెళ్లిపోయాడు. పొద్దుపోయిన సమయంలో దుకాణం నుంచి మంటలు వచ్చి దుకాణం మొత్తం దగ్ధమైనట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సమాచారం అందుకున్న పెద గంట్యాడ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. దానికి ఆనుకొని ఉన్న ఇతర దుకాణాలకు మంటలు వ్యాప్తి చెందకుండా సిబ్బంది అప్రమత్తమయ్యారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకొని ఉంటుందని మార్కెట్‌వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రమాదంలో రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగిందని దుకాణ యజమాని తెలిపాడు.

వేర్వేరు సంఘటనల్లో ఇద్దరి మృతి

కూర్మన్నపాలెం: రెండు వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనలపై సీఐ మల్లేశ్వర రావు అందించిన వివరాలు.. అగనంపూడి సత్తివాని పాలెంలో నివాసముంటున్న అల్లూరి సురేష్ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆదివారం ఆయన విధులకు వెళ్లడంతో భార్య అరుణకుమారి విజయనగరం వెళ్లింది. అనంతరం అక్కడి నుంచి ఎన్నిసార్లు ఫోన్ చేసినా భర్త నుంచి స్పందన రాలేదు. దీంతో సమీపంలో ఉన్న బంధువులకు వాకబు చేయమని ఫోను చేసింది. వారు కిటికీలో నుంచి చూడగా సురేష్ ఫ్యాన్‌కు ఉరి పోసుకుని కనిపించాడు. వారు అరుణకుమారికి విషయం చేరవేశారు. దీంతో ఆమె ఇంటికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించింది.

కాలువలో ఒకరు..

అలాగే పెదగంట్యాడ మండలం దేవాడ రాజీవ్‌నగర్‌లో నివాసముంటున్న ముస్సీలగూన్ ఉక్కు కర్మాగారంలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి సైకిల్‌పై విధులకు వెళ్లాడు. అయితే కాంట్రాక్టర్ ఫోన్‌చేసి లగూన్ డ్యూటీకి రాలేదని ఆయన భార్యకు తెలిపాడు. దీంతో ఆమె బంధువుల సహాయంతో వెతకగా ఇస్లాంపేట సమీపంలోని కాలువలో శవమై కనిపించాడు. దీంతో ఆమె పోలీసులకు సమాచారం అందించింది. ఈ రెండు సంఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలను కేజీహెచ్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

అప్రమత్తతతో క్షయకు చెక్



క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తూ మానవహారం



క్షయవ్యాధిపై అవగాహనపై ర్యాలీ

కూర్మన్నపాలెం: అప్రమత్తతతో క్షయవ్యాధికి చెక్ పెట్టవచ్చునని కణితిప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివయ్య అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం వడ్లపూడిలో ప్రదర్శన నిర్వహించారు. అంతక ముందు కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రధాన రహదారి మీదుగా గాంధీబొమ్మవరకు ర్యాలీ నిర్వహించి అక్కడ సిబ్బంది, విద్యార్థులు మానవ హారం చేపట్టారు. డాక్టర్ శివయ్య మాట్లాడుతూ క్షయవ్యాధిని పూర్తిగా నివారించడానికి మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. దగ్గు వారం కంటే ఎక్కువ రోజులు వస్తే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి తనిఖీలు నిర్వహించుకోవాలని సూచించారు. ర్యాలీలో చేయిచేయి కలుపుదాం టీబీని తరిమికొడదాం.. టీబీ అంటే భయం వద్దు- చికిత్స ముద్దు, టీబీ ఓడిపోతుంది... దేశం గెలుస్తుందని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అగనంపూడి టీబీ యూనిట్ అధికారులు వి.అనిల్ కుమార్, ఎం. వాసు, శైలజ, రాణి,లోవరాజు, జనల్ నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎం.ఎస్.శాస్త్రి జీవితం ఆదర్శనీయం



ఐఐటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణరావును సత్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: విశిష్ట పరిశోధకుడిగా, పరిపాలన దక్షుడిగా జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన ఆచార్య ఎం.ఎస్.శాస్త్రి జీవితం నేటి యువతకు స్ఫూర్తిని కలిగిస్తుందని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో సోమవారం ఆచార్య ఎం.ఎస్.శాస్త్రి స్మారక ఉపన్యాసం ఏర్పాటు చేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. వీసీ మాట్లాడుతూ ఆచార్య ఎం.ఎస్ శాస్త్రి స్మారక ఉపన్యాసం నిర్వహించడం, ఈ కార్యక్రమ ఏర్పాటుకు విభాగం చొరవ తీసుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. సుదీర్ఘ కాలం అత్యుత్తమ సేవలు అందించిన వారిని గుర్తు చేసుకోవడం, నేటి తరం యువతకు వీరిని పరిచయం చేయడం, వీరి పరిశోధనలు, విశిష్టతను తెలియజేయడం ముదావహమని చెప్పారు. ఉత్సుకత వ్యక్తి ప్రగతికి ప్రేరణ శక్తిగా నిలుస్తుందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ–కాన్పూర్) రసాయన శాస్త్ర విభాగ ఆచార్యుడు ఎం.లక్ష్మీనారాయణరావు అన్నారు. నూతన అంశాలను నేర్చుకోవాలని తపన, జిజ్ఞాస విద్యార్థులు ఎల్లవేళలా కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.గిరిజా శంకర్, అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్‌కుమార్, విభాగాచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవితకు గ్రంథాలయాలు దోహదం

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల లైబ్రేరియన్ల వర్క్‌షాప్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.వి జయబాబు మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవితకు గ్రంథాయాల సేవలు ఎంతో దోహదపడతాయన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ చీఫ్ లైబ్రేరియన్ ప్రొఫెసర్ పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రంథాలయాల ఆవశ్యకతను తెలియజేశారు. నేటి డిజిటల్ యుగంలో గ్రంథాలయాల పాత్ర, ఉపయోగించాల్సిన వివిధ రకాల సాఫ్ట్‌వేర్‌ల గురించి వివరించారు. సెంటర్ గాంధీనగర్ అహ్మదాబాద్‌కు చెందిన సైంటిస్ట్ హేమ చోలిన్ రిసోర్స్ పర్సన్‌గా విచ్చేసి గ్రంథాలయాలను డిసిప్టలైజేషన్ చేయడంలో ఉపయోగించే సాఫ్ట్‌వేర్ గురించి పూర్తిస్థాయిలో గ్రంథాలయ అధికారులకు అవగాహన కల్పించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరించిన కృష్ణా కళాశాల గ్రంథాలయ అధికారి డాక్టర్ ఎం.శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ వర్క్‌షాప్‌కు రాష్ట్ర వ్యాప్తంగా 40 మంది లైబ్రేరియన్లు హాజరయ్యారని తెలిపారు. కళాశాలల గ్రంథాలయాలు విద్యార్థులకు అందిస్తున్న వివిధ సేవలను గురించి తెలియజేస్తూ, గ్రంథాలయం డిజిటలైజేషన్ చేయడంతో సేవలు మరింత చేరువవుతున్నాయన్నారు. త్వరితగతిన విద్యార్థులకు, అధ్యాపకులకు తమ పరిశోధనకు సంబంధించిన అత్యంత విలువైన సమాచారాన్ని అందుబాటులోకి తెచ్చేలా కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు.

మురుగు కూపాలు.. చెత్తకుప్పలు



వుడాకాలనీ ప్రధాన రహదారిలో పూడికలు ఇలా..



హౌసింగ్‌బోర్డుకాలనీ పెంటమాంబ ఆలయ సమీపంలోని కాలువలో పేరుకుపోయిన పూడిక

పరిశుభ్రతలోఆదర్శంగా నిలిచిన గాజువాక జోన్‌ను ప్రస్తుతం మురుగు సమస్యలు వేధిస్తున్నాయి. ఎక్కడ చూసినా మురుగుకూపాలు.. చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. దుర్వాసనతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.ముఖ్యంగా జీవీఎంసీ 74వ వార్డు పరిధి వుడాకాలనీ ప్రధాన రహదారిలో మురుగు కాలువల్లో పందులు సంచరిస్తున్నాయి. దోమలు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. దీనిపై వార్డు శానిటరీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. – 74వ వార్డు సిద్ధేశ్వరం దుర్గమ్మ ఆలయం సమీపంలో చెత్తా చెదారాన్ని తొలగించడం లేదని స్థానికులు వాపోతున్నారు. 75వ వార్డు కుంచమాంబ ఆలయ పరిసర ప్రాంతాల్లో కాలువలు తీయడం లేదని, ఎక్కడి చెత్త అక్కడే వదిలేయడంతో ఒక పక్క దోమలు, మరో పరోపక్క పందులు, దుర్వాసనతో కంటిమీద కునుకు లేకుండా పోతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా 65వ వార్డు వికాస్‌నగర్, భవానీ నగర్, ప్రభుత్వ ఐటీఐ పరిసర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకుంది.76, 77వ వార్డుల్లో అదే పరిస్థితి. శానిటరీ అధికారులు ఉన్నారా అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. – పెదగంట్యాడ



సిద్ధేశ్వరం దుర్గమ్మ ఆలయ సమీపంలో..



75వ వార్డు కుంచమాంబ ఆలయ సమీపంలో..